సాక్షి ఆదిలాబాద్

బుధవారం ‌। 4 ‌। జనవరి ‌। 2023



సావిత్రీబాయి .. ఆదర్శనీయం

సావిత్రీబాయి పూలే జయంతిని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

జిల్లా కేంద్రంలో 30 పోలీస్ యాక్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. రాజకీయ పార్టీలు, కుల, విద్యార్థి, తదితర సంఘాలు అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ఈనెల 31 వరకు ఈ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గరిష్టం/కనిష్టం
28.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. చలి ప్రభావం కొంత తగ్గనుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు



డీఈవో జారీ చేసిన ఉత్తర్వులు

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల మధ్య గొడవలు, అనధికార డిప్యూటేషన్లపై 'గురువా ఇదేం గొడవ' శీర్షికన 'సాక్షి'లో డిసెంబర్ 29న ప్రచురితమైన కథనానికి డీఈవో ప్రణీత స్పందించారు. గతంలో జైనథ్ మండలం మేడిగూడ(ఆర్) రోడ్ పాఠశాల నుంచి భీంపూర్ మండలం అంతర్గాంకు ఓ ఉపాధ్యాయుడికి డిప్యూటేషన్ ఇచ్చారు. కాగా, ఉపాధ్యాయులు అవసరానికి మించి పాఠశాలల్లో ఉంటే సంబంధిత మండలాల్లో సర్దుబాటు చేయాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా మరో మండలానికి కేటాయించారు. ఈ క్రమంలో 'సాక్షి'లో వచ్చిన కథనంపై స్పందించిన డీఈవో ఆ డిప్యూటేషన్‌ను రద్దు చేసి జైనథ్ మండలంలోని పెండల్‌వాడకు సదరు ఉపాధ్యాయుడిని కేటాయించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమశాఖ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–4, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం అందించనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. 60 శాతం మార్కులతో డిగ్రీ పాసైన వారికి గ్రూప్–4, అలాగే హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగాలకు శిక్షణ తీసుకునే అభ్యర్థులు డిగ్రీ, బీఈడీలో 60 శాతం మార్కులతో పాసై ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 11 వరకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 12 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 08732–221280 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

ఆదిలాబాద్‌రూరల్: పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై మెయిన్స్ ఉచిత శిక్షణ తరగతులు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. స్టడీ సర్కిల్ సెంటర్ నుంచి ఫోన్ వచ్చిన అభ్యర్థులు ఉదయం 10గంటలకు తరగతులకు హాజరుకావాలని సూచించారు. నిష్ణాతులైన అధ్యాపకులతో బోధనతో పాటు ప్రతీరోజు పరీక్ష ఉంటుందని తెలిపారు.

నేడు రేషన్ డీలర్లకు అవగాహన

కైలాస్‌నగర్: జిల్లాలోని రేషన్ డీలర్లకు ఈ నెల 4న అదనపు ఆదాయంపై పట్టణంలోని రెవెన్యూ గార్డెన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వో టి.కిరణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లాలోని డీలర్లందరూ హాజరు కావాలని కోరారు.

ఉచిత బియ్యం ఐదు కిలోలే..

కైలాస్‌నగర్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మరో ఏడాది పాటు రేషన్‌కార్డు దారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌వో కిరణ్‌కుమార్ తెలిపారు. ఒక్కో యూనిట్‌కు 5 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయాలని పేర్కొంటూ ప్రభుత్వం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయినట్లు పేర్కొన్నారు. ఎఫ్‌ఎస్‌సీ కార్డుదారులకు యూనిట్‌కు 5 కిలోల చొప్పున, ఏఎఫ్‌ఎస్‌సీ కార్డుదారులకు 35 కిలోలు, అన్నపూర్ణకార్డు దారులకు 10కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందజేయనున్నట్లు వివరించారు. ఈనెల 5 నుంచి రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ఇటీవల విధుల్లో చేరిన 25 మంది నూతన వైద్యులతో మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగుల విషయంలో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు ఉన్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధికి ఆధార్ లింక్

- జాబ్‌కార్డుతో అనుసంధానం
- లేకుంటే కూలి చెల్లింపులు బంద్
- పేర్లలో పొరపాట్లతో భారీగా తిరస్కరణ
- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ

జిల్లాలో
మండలాలు: 17
జాబ్‌కార్డులు : 2,30,219
ఆధార్ నమోదు చేసినవి: 2,20,060
ఇంకా ఆధార్ నమోదు చేయాల్సినవి : 10,159
కూలి చెల్లింపునకు సిద్ధంగా ఉన్న ఖాతాలు: 11,895

కైలాస్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. కూలీల హాజరు నమోదు కోసం ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్)ను అమల్లోకి తెచ్చిన కేంద్రం తాజాగా కూలీల చెల్లింపుల్లోనూ కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ఉపాధి కూలీల జాబ్‌కార్డును వారి ఆధార్‌తో అనుసంధానం చేస్తోంది. దీంతో బోగస్ కూలీలకు చెక్ పడనుండగా, కేంద్రం విడుదల చేసే నిధులు నేరుగా కూలీల ఖాతాల్లో జమ కానున్నాయి. చెల్లింపుల్లో పారదర్శకత ఏర్పడనుంది. అయితే ఆధార్ సీడింగ్‌లో జిల్లా మెరుగైన స్థానంలో ఉన్నా జాబ్‌కార్డు, ఆధార్ వివరాలు సరిపోలకపోవడం సమస్యాత్మకంగా మారుతోంది. ఆధార్ అథెంటికేషన్ ప్రక్రియ కొనసాగుతుండగా వేలాది దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో కూలీలు ఉపాధికి దూరమయ్యే అవకాశముంది.

ఆధార్ అనుసంధానమైతేనే కూలి

ఉపాధి హామీ కూలీలకు ప్రస్తుతం బ్యాంక్, పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా కూలి పులు చేస్తోంది. అయితే కొందరికి రెండేసి చొప్పున జాబ్‌కార్డులు ఉండటంతో పాటు, మరికొంత మంది పనులకు హాజరు కాకున్నా కూలి పొందుతున్నారు. రాజకీయ పలుకుబడి, నాయకుల అండదండలతో పనులకు హాజరవుతున్నట్లుగా పేర్లు నమోదు చేసుకుని డబ్బులు స్వాహా చేస్తున్నారు. దీన్ని గుర్తించిన కేంద్రం కూలి చెల్లింపుల్లో పూర్తి పారదర్శకత తీసుకురావాలని సంకల్పించింది. కూలి చెల్లింపుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా ఆధార్ బేస్డ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇందులో భాగంగానే కూలీల జాబ్ కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేస్తోంది. దీంతో ఇకపై ఆధార్ లింకైన బ్యాంక్, పోస్టల్ బ్యాంక్ ఖాతాల్లో మాత్రమే కూలి డబ్బులు జమకానున్నాయి. పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టం(పీఎఫ్‌ఎంఎస్) ద్వారా కేంద్రం నేరుగా డబ్బులు ఎక్కడికి వెలుతున్నాయనేదీ ఢిల్లీ నుంచి పర్యవేక్షించే వెసులుబాటు కలుగనుంది.

కొనసాగుతున్న అథెంటికేషన్

జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటివరకు 95శాతం జాబ్‌కార్డులకు ఆధార్‌ను లింక్ చేశారు. అయితే రెండింటిలో కూలీల పేర్లు, చిరునామా వంటి వివరాలు సరిపోలకపోవడంతోనే భారీగా తిరస్కరణకు గురయ్యాయి. 2,19,593 జాబ్‌కార్డులను అథెంటికేషన్ కోసం పంపించగా అందులో కేవలం 39,457 మాత్రమే విజయవంతమయ్యాయి. 1,80,136 తిరస్కరణకు గురయ్యాయి. మరో 467 అథింటికేషన్ కోసం పంపించాల్సి ఉంది. ఈ ప్రక్రియను పూర్తిస్థాయిలో చేపట్టనట్‌లైతే కూలీలు పనులకు దూరమయ్యే ప్రమాదం లేకపోలేదు. కేవలం 11,895 జాబ్‌కార్డులు మాత్రమే కూలీల చెల్లింపునకు సిద్ధంగా ఉండటం గమనార్హం.

మండలాల వారీగా ఆధార్ లింక్ అయిన జాబ్‌కార్డుల సమాచారం..

మండలం	మొత్తంజాబ్‌కార్డులు	ఆధార్‌లింక్‌అయ్యింది	తిరస్కరించబడ్డవి	ఆమోదం
బేల	14,852	13,608	10,604	916
ఆదిలాబాద్	17,099	15,856	14,546	1,049
గుడిహత్నూర్	14,566	13,457	11,551	826
ఉట్నూర్	21,581	20,650	15,741	732
గాదిగూడ	10,186	9,399	8,524	579
ఇంద్రవెల్లి	19,379	18,625	13,867	835
నార్నూర్	15,033	14,308	11,389	215
సిరికొండ	9,179	8,578	5,747	1,794
భీంపూర్	10,808	10,325	7,694	243
బజార్‌హత్నూర్	13,664	13,208	12,370	486
నేరడిగొండ	13,953	13,557	7,935	1,559
ఇచ్చోడ	13,242	12,913	10,914	745
తాంసి	7,236	6,908	5,977	342
జైనథ్	16,780	16,513	14,705	305
బోథ్	18,582	18,363	16,905	862
తలమడుగు	11,704	11,524	10,172	167
మావల	2,375	2,268	1,495	240

మార్పులకు అవకాశమిస్తారు



జాబ్‌కార్డు, ఆధార్‌లోని వివరాలు సరిపోలకపోవడంతోనే ఆధార్ అథెంటికేషన్‌లో తిరస్కరణకు గురవుతున్నట్లుగా మా దృష్టికి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. వీటి సవరణకు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించనుంది. ఆధార్‌బేస్డ్ పేమేంట్‌తో అక్రమాలకు పూర్తి అడ్డుకట్ట పడనుంది. – రాథోడ్ రవీందర్, ఏపీడీ, డీఆర్డీఏ

చెప్పిన చోటే.. సెంటర్లు!

- కేయూ పరీక్షా కేంద్రాల్లో అవకతవకలు
- యాజమాన్యాల ఒత్తిళ్లే కారణమా..?
- అధికారుల తీరుపై అనుమానాలు
- దూరభారంతో విద్యార్థులకు ఇక్కట్లు
- వెంటనే కేంద్రాలు మార్చాలని డిమాండ్
- నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు



బోథ్: 'సార్.. మా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని మండలంలోనే వేయండి. ఆ మండలంలో ఉన్న కళాశాలలో నాకు 20 శాతం వాటా ఉంది. ఆ కళాశాలలో మా విద్యార్థులు పరీక్ష రాస్తే పాస్ అయ్యే అవకాశం ఉంటుంది. మిగతా కళాశాలల కేంద్రాలను దూర ప్రాంతాల్లో వేయించండి. మీరే యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి సెట్ చేయండి. మీకు ఇంత ఇస్తాను సర్..' అంటూ ఓ కళాశాల యజమాని ఓ ప్రభుత్వ అధ్యాపకుడితో అన్న మాటలివి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ప్రభుత్వ అధ్యాపకుడు ఇందుకు మధ్యవర్తిగా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం ఆ అధ్యాపకుడితో రెండు కళాశాలల యాజమాన్యాల పెద్దలు విందు రాజకీయాలు చేసి కళాశాల డిగ్రీ కేంద్రాలను మార్చాలని విన్నవించినట్లు సమాచారం. మరుసటిరోజు ఆ యాజమాన్యాలు చెప్పిన చోటకే కళాశాలల కేంద్రాలు మారిపోయాయి. ఇందుకు ఆ అధ్యాపకుడుకి కొంత ముట్టజెప్పినట్లు తెలిసింది.

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ వర్సిటీ పరిధిలో బుధవారం నుంచి డిగ్రీ మూడు,ఐదోసెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్సిటీ అధికారులు 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే విద్యార్థుల సమస్యలు పట్టకుండా వర్సిటీ అధికారులు ఇష్టానుసారంగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆరోపణలున్నాయి. కొన్ని కళాశాలల యాజమాన్యాల ఒత్తిడికి యూనివర్సిటీలోని అధికారులు తలొగ్గి కేంద్రాలను యాజమాన్యాలు చెప్పిన చోట ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా మౌలిక వసతులున్న కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అధికారులను కలిసిన కొన్ని కళాశాల యజమానులు వారు చెప్పిన చోట కేంద్రాలను ఏర్పాటు చేశారని ఆరోపణలున్నాయి. ఇప్పటికే అధికారులు యాజమన్యాల ఒత్తిడికి పరీక్షా కేంద్రాల జాబితాను మూడుసార్లు మార్చడం గమనార్హం.

కేంద్రాల ఏర్పాటు ఇలా..

- బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని బోథ్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేశారు. రెండు రోజుల తరువాత తిరిగి ఆ సెంటర్‌ను నేరడిగొండలోని రెండు కళాశాలలకు మార్చారు. గిర్నూర్ గ్రామం నుంచి 7.7కిలోమీటర్ల దూరంలోని ఇచ్చోడలో కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా 23 కిలోమీటర్ల దూరంలోని నేరడిగొండ మండల కేంద్రంలోని రెండు కళాశాలల్లో అధికారులు ఏర్పాటు చేయడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో విద్యార్థులకు దూరం పెరిగే అవకాశం కూడా ఉంది. గిరిజన, ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చే వారు పరీక్షకు హాజరు కాలేని పరిస్థితి నెలకొంది.
- దూరాన్ని దృష్టిలో ఉంచుకుని బేల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాల సెంటర్‌ను బేలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే ఏర్పాటు చేశారు.
- బోథ్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాల కేంద్రాన్ని ఏకంగా 30 కిలో మీటర్ల దూరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడి విద్యార్థులకు ఇక్కట్లు తప్పని పరిస్థితి. బేలలో ఏర్పాటు చేసిన విధంగా తమకు బోథ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని నిగిని గ్రామం నుంచి ఇచ్చోడకు దాదాపు 45 కిలోమీటర్లు ఉంటుంది. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా 8.30 గంటలకు కేంద్రాల్లో ఉండాలి. ఈ గ్రామం నుంచి వచ్చే విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవడం కష్టంగా మారుతుంది. బస్సు సౌకర్యం కూడా లేదు.

అధికారుల పొంతనలేని సమాధానం..

డిగ్రీ పరీక్షల కేంద్రాల విషయంలో కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మల్లారెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. దూరంగా ఉన్న కేంద్రాలను ఆయన సమర్థించారు. గతంలో తాను నడిచి వెళ్లి పరీక్ష రాసానని, విద్యార్థులకు కేంద్రాలు దూరం అయినా రాయాల్సిందేనని పేర్కొన్నారు. మరోవైపు అదనపు పరీక్షల నియంత్రణ అధికారి నరేందర్‌ను సంప్రదించగా.. కళాశాల మధ్య పోటీ వల్ల డిగ్రీ పరీక్షల కేంద్రాల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలతో ఫోన్లు చే యిస్తున్నారని, గత్యంతరం లేక ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. అసలు ఆ కళాశాలలు ఎక్కడ ఉన్నాయో తెలియకుండానే ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలపడంపై అధికారులపై రాజ కీయ ఒత్తిడి ఏవిధంగాఉందో అర్థమవుతోంది.

వసతులు లేకున్నా..

పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేటప్పుడు వర్సిటీ అధికారులు ఆయా డిగ్రీ కళాశాలల్లోని సౌకర్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. కళాశాలలో నీటి వసతి, మూత్రశాలలు, సరిపడా తరగతి గదులు, సిబ్బంది ఉన్న కళాశాలల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కానీ.. వర్సిటీ నుంచే కేంద్రాలను డిసైడ్ చేస్తున్నారు. తీరా కళాశాలల్లో సరైన సదుపాయాలు కూడా ఉండడం లేదు. అధికారులపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్రమైన ఒత్తిడి తెచ్చి వారి ఇష్టానుసారంగా కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

సెంటర్‌ను దగ్గరకు మార్చాలి



నాది బోథ్ మండలం బాబెర గ్రామం. నేను ఆదివాసీ విద్యార్థిని. బోథ్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువున్న. పరీక్షాకేంద్రాన్ని ఇచ్చోడలో ఏర్పాటు చేశారు. మా ఊరి నుంచి బోథ్‌కు రావడానికి 15 కిలోమీటర్ల దూరం ఉండగా గంటపాటు ప్రయాణించాలి. బస్సులు లేవు. ఉదయం ఆరు గంటలకు ఇంటి నుంచి బయలుదేరితే 8గంటలకు బోథ్‌కు చేరుకుంటాం. బోథ్ నుంచి ఇచ్చోడకు వెళ్లాలంటే గంట ప్రయాణం చేయాలి. ఇచ్చోడలో దిగి పరీక్షా కేంద్రానికి దాదాపు 20 నిమిషాలు నడవాలి. ఇది నాకు చాలా ఇబ్బంది అవుతుంది. సెంటర్‌ను బోథ్‌లోనే ఏర్పాటు చేయాలి.
– ఆత్రం గణేశ్, డిగ్రీ విద్యార్థి

'కంటి వెలుగు' విజయవంతం చేయాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్లు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

కైలాస్‌నగర్: ఈనెల 18 నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు మలివిడత కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు సూచించారు. హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. దీని నిర్వహణకు షెడ్యూల్ రూపొందించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలు, వార్డుల్లో ప్రజలంతా కంటి వెలుగును సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిబిరాల నిర్వహణకు నిధుల విడుదల, రీడింగ్ కళ్లద్దాలను జిల్లాకు ముందుగానే పంపుతామన్నారు. కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ప్రతి జిల్లాకో ప్రత్యేక బృందాన్ని పంపిస్తున్నట్లుగా వెల్లడించారు. స్వశక్తి మహిళా సంఘాలు, మెప్మా బృందాల సహకారంతో ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనం రుచి చూస్తున్న క్షేమాదేశ్‌పాండే

తాంసి: గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతిరోజు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షేమాదేశ్‌పాండే అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థుల మాట్లాడి, సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. వారి వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది జయ, హెచ్‌ఎం ప్రభాకర్, వార్డెన్ స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి

ఎదులాపురం: మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శైలజను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికులకు యూనిఫాం, సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు, గమ్ షూస్ వెంటనే అందించాలని, ఆదివారం వారంతపు సెలవుతో పాటు పండుగ సెలవులు అమలు చేయాలన్నా రు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు, పెరిగిన జీతాల ఏరియర్స్ వెంటనే ఇవ్వాలన్నారు. ప్రతి నెల 7వ తేదీ లోపు జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమలంఓ సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, కార్మికులు ఉన్నారు.

టీఎల్‌ఎంతో అర్థవంతమైన బోధన



బోధనోపకరణాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఇచ్చోడ: బోధనోపకరణాలతో అర్థవంతమైన బోధన చేయవచ్చని డీఈవో ప్రణీత అన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధనోపకరణాలతో బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రీతంరెడ్డి, సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ శిరీష్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ గఫార్, ప్రాథమిక పాఠశాల చైర్మన్ కలీం, మండల విద్యాధికారి ఉదయ్‌రావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జియావుద్దీన్, నవీన్ కుమార్ రెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ రామేశ్వరరావు, గైడ్ టీచర్స్ జగన్మోహన్‌రెడ్డి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

'పుర ప్రజావాణి'కి 31 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన 'పుర ప్రజావాణి'కి స్పందన లభించింది. తమ సమస్యలను నివేదించేందుకు జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. వారు సమర్పించిన అర్జీలను మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, కమిషనర్ శైలజ స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబధించి మొత్తం 31 అర్జీలు అందాయి. ఇందులో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి పది, రెవెన్యూ 12, ఇంజినీరింగ్ 7, శానిటేషన్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు ఉన్నాయి. వీటిని ఆయా విభాగాల అధికారులకు అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కాగా గత వారం అందిన 27 అర్జీలను పరిష్కరించినట్లుగా చైర్మన్ వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిని జిల్లాకేంద్రం వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, డీఈలు తిరుపతి, యూనుస్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఆర్‌వోలు జాదవ్ కృష్ణ, నితిన్, టీపీఎస్ అనురాధ, ఎస్సై నరేందర్, ఆర్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు నోట్‌పుస్తకాలు, పూలమొక్కను అందజేస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

కైలాస్‌నగర్: నూతన సంవత్సరం పురస్కరించుకుని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను పలు శాఖల అధికారులు, ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వయోవృద్ధుల సమాఖ్య, పర్ధాన్ సమాజ్ ప్రతినిధులు, బ్యాంక్, వ్యవసాయం, జైళ్లు, వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు తమ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కలెక్టర్‌ను కలిశారు. పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలతో పాటు నోట్ పుస్తకాలు, బ్లాంకెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'కలెక్టర్ ఎట్ హోమ్' కార్యక్రమం..

నూతన సంవత్సరం పురస్కరించుకొని కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం రాత్రి ఎట్ హోమ్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని గాంధీ పార్కులో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషాషేక్, నటరాజ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విందు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన ఆత్రం కృష్ణ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్రం కృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా తిరుగుతుండేవాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం 8గంటల సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 6గంటలకు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.

అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య


వికేశ్ (ఫైల్)

లక్ష్మణచాంద: అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన వికేశ్ (36) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాహుల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


గణేశ్ (ఫైల్)

ముధోల్: మండల కేంద్రానికి చెందిన భారమొల్ల గణేశ్ (19) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. భారమొల్ల హన్మాండ్లు కుమారుడు గణేశ్ సోమవారం రాత్రి పొలానికి వెళ్తాన్నానని బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం తన తమ్ముడు యోగేశ్ పొలానికి వెళ్లి చూడగా బొబ్బిలి చెట్టుకు ఉరేసుకుని చనిపోయి ఉండడం గమనించాడు. మృతుడు మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు తండ్రి హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యను అడ్డుకున్న పోలీసులు

- కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబికులకు అప్పగింత


బాధితుడితో సోన్ పోలీసులు

లక్ష్మణచాంద: ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఓ వ్యక్తిని సోన్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంటాల మండల కేంద్రానికి చెందిన సిర్ల భోజన్న కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. సోన్ మండల కేంద్రంలోని గోదావరి బ్రిడ్జి వద్దకు మంగళవారం మధ్యాహ్నం చేరుకున్నాడు. బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకేందుకు యత్నించాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సోన్ పోలీస్‌స్టేషన్‌లో పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న విక్టర్ పాల్, సూర్యభాను అతడిని వారించారు. భోజన్నను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విక్టర్‌పాల్, సూర్యభానును ఎస్సై రవీందర్ అభినందించారు.



కొనసాగుతున్న మెస్రం వంశీయుల పాదయాత్ర

నార్నూర్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేకపూజ కోసం గంగాజలాన్ని తీసుకురావడానికి మెస్రం వంశీయులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం గుండాలకు చేరింది. ఇక్కడే బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి లోకారి బీ గ్రామానికి పాదయాత్రగా బయలుదేరారు. అక్కడ బస చేసి బుధవారం మండలంలోని మల్కుగూడ గ్రామానికి చేరుకుంటారు. ఆయా కార్యక్రమాల్లో మెస్రం హన్మంతరావు కటోడ, మెస్రం తుక్డోజీ పర్దాన్, తిరుపతి కోత్వాల్, వంశ పెద్దలు మెస్రం నారంజీ పటేల్, మెస్రం శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


గుండాల గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మెస్రం వంశీయులు

మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన డీపీఆర్వో

నిర్మల్‌చైన్‌గేట్: అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మిని మంగళవారం డీపీఆర్వో తిరుమల వేరువేరుగా వారి స్వగృహాలోకల మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రికి పూలమొక్క ఇస్తున్న డీపీఆర్వో విజయలక్ష్మి →



మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

ఖానాపూర్: పట్టణాలతోపాటు మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మత్స్య సహకార సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ బొజ్జ నారాయణ కోరారు. పట్టణంలో చేపల మార్కెట్‌ను మంగళవారం సందర్శించి మాట్లాడారు. మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో మత్స్యకారులు ఏళ్లుగా రోడ్డు పక్కన వీధుల్లో అసౌకర్యాల మధ్య చేపలు విక్రయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వెంటనే ఆధునిక సౌకర్యాలతో కూడిన మార్కెట్లు నిర్మించాలని కోరారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వంతోపాటు మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీ నివాస్, ఆ శాఖ కమిషనర్ లచ్చిరాం నాయక్‌కు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివయ్య, చిన్నయ్య, నాగరాజు, రవీందర్, మల్లేశ్, రాము, ప్రవీణ్, భీమేశ్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో రోడ్డుపై చేపలు విక్రయిస్తుండగా పరిశీలిస్తున్న నాయకులు

ఐదు హత్యల కేసులో ఒకరికి జీవిత ఖైదు

నిర్మల్‌టౌన్: 2016లో భైంసా పట్టణంలో సంచలనం సృష్టించిన ఐదుగురి హత్య కేసులో నిందితుడికి జిల్లా కోర్టు జీవిత ఖైదుతోపాటు, రూ.25 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భైంసా పట్టణంలో 2013లో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగగా దానికి సంబంధించిన కేసులో ఒక కుటుంబం ఫిర్యాదు చేయగా ప్రత్యర్థి కుటుంబం వారికి కోర్టు శిక్ష విధించింది. దీంతో కక్షగట్టిన ప్రత్యర్థి కుటుంబానికి చెందిన మజీద్, మరో వ్యక్తి 2016 మే 5న భైంసా చౌరస్తాలో ఆ కుటుంబానికి చెందిన ఇద్దరినీ తల్వార్లతో అతి కిరాతకంగా నరికి చంపారు. వారి ఇంటికి వెళ్లి కుటుంబంలోని మరో ముగ్గురినీ తల్వార్లతో నరికి హత్య చేశారు. వీరిలో ఒకరు కోర్టు ట్రయల్‌లోనే అనారోగ్యంతో మరణించగా, మాజీద్‌కు జిల్లా కోర్టు సోమవారం జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషిచేసిన సిబ్బందితోపాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డిని ఎస్పీ సన్మానించారు. భైంసా ఏఎస్పీ కిరణ్ ఖారే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి, భైంసా పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, లైసన్ అధికారి సక్రియానాయక్, అసిస్టెంట్ లైసన్ అధికారి శంకర్ పాల్గొన్నారు.


పీపీ రమణారెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ

ఏజెన్సీ ఏరియాను రీషెడ్యూల్ చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ఏరియాలో రాష్ట్ర విభజన చట్టంలో ఉన్నట్లుగా రీషెడ్యూల్ చేయాలని తెలంగాణ రాష్ట్ర నాన్‌ట్రైబల్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భారత్ వాగ్మారే, ప్రధాన కార్యదర్శి మల్లెపూల నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాన్ ట్రైబల్స్ జనాభా 50 శాతం కంటే ఎక్కువగా ఉన్న గ్రామాలను ఏజెన్సీ నుంచి తొలగించాలన్నారు. సుప్రీం కోర్టు జీవో నంబర్ 3 ను కొట్టివేసినందున విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో నాన్‌ట్రైబల్స్‌కు 50 శాతం అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నాన్ ట్రైబల్స్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. తెలంగాణ రాష్ట్ర నాన్ ట్రైబల్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు నాగోరావు జాడే, గౌరవాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ ఫయ్యాజ్, నాయకులు బుట్టోఖాన్, ఉత్తం, తిరుపతి, గోపాల్‌సింగ్, ప్రజ్ఞశీల్, ఉద్ధవ్ కాంబ్లే, దయానంద్, సంజీవ్, సంజయ్, విశ్వనాథ్, జైనొద్దీన్, బ్రిడ్జిలాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భరత్

రాణాకు చేరిన గేదె పంచాయితీ

నేరడిగొండ: చోరీలు, ఘర్షణలు, ఇతర కేసులు పోలీస్‌స్టేషన్‌కు రావడం సాధారణం. కానీ.. మంగళవారం నేరడిగొండ ఠాకుకు కొత్తగా ఓ గేదె కేసు వచ్చింది. వివరాలు.. మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కిషన్ అనే రైతు ఖాతాలో ఇటీవల రైతుబంధు డబ్బులు జమయ్యాయి. అందులోంచి తనకు రూ.5వేలు ఇవ్వాలని అతడి కుమారుడు మారుతి కోరాడు. లేకుంటే ఉన్నొక్క గేదెను అమ్మేస్తానని చెప్పాడు. దీంతో సదరు రైతు సర్పంచ్ జంగ్‌కు విషయాన్ని తెలిపాడు. సర్పంచ్ సముదాయించే ప్రయత్నం చేయగా వినకపోవడంతో ఏకంగా బర్రె పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. బర్రెతో పాటు తండ్రీకొడుకులు 'సార్ మాకు న్యాయం చేయండి' అంటూ స్థానిక పోలీసులను కోరారు. దీంతో నేరడిగొండ ఎస్సై సాయన్న రైతు కుమారుడిని మందలించారు. ఉన్నొక్క గేదె ద్వారా పాలు అమ్మితేనే కుటుంబం గడుస్తుందని, అమ్మితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించగా గేదె పంచాయితీ ముగిసింది.


నేరడిగొండ పోలీస్‌స్టేషన్ వద్ద కట్టేసి ఉన్న గేదె

నీల్‌గాయిని హతమార్చిన ఏడుగురిపై కేసు

పెంబి: నీల్‌గాయిని వేటాడి హతమార్చి మాంసాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పెంబి రేంజ్ ఎఫ్ఆర్‌వో రామకృష్ణ తెలిపారు. ఎఫ్ఆర్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన సాట్ల చిన్నయ్య, దోసంట్ల శ్రీను, సాట్ల రెడ్డి, సీమల ఎల్లారెడ్డి, నైనేని రాజు, సిర్పేల్లి వెంకటి, కస్తూరి రాజేందర్ కలిసి యాపలగూడ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి నీల్‌గాయిని హతమార్చారు. మాంసాన్ని విక్రయించేందుకు ముక్కలు చేస్తుండగా సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం వారిపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఎస్‌వో కింగ్‌ఫిషర్, ఎఫ్‌బీవోలు ఉదయ్, శివ పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఓ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేస్తున్న కాంబ్లే లఖన్‌పై రిజ్వాన్ అనే వ్యక్తి దాడి చేశాడు. దీంతో రిజ్వాన్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ కాలనీకి చెందిన కాంబ్లే లఖన్ తన కూతురు అనారోగ్యానికి గురి కాగా సోమవారం తిలక్‌నగర్‌లోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అక్కడే ఉన్న మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసే సమయంలో ఓ మహిళ అతడి వెనుక నిలబడింది. తానే ముందుగా మందులు తీసుకుంటానని వెనుక నిల్చున్న క్రాంతినగర్‌కు చెందిన మహిళకు లఖన్ చెప్పగా అక్కడే ఉన్న ఆమె భర్త రిజ్వాన్ 'నా భార్యను ఏమంటున్నావ్' అని అతడిని చితకబాదాడు. తన స్నేహితులతో కలిసి కొట్టి గాయపర్చాడు. రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందిన లఖన్ ఫిర్యాదు చేయగా మంగళవారం రిజ్వాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఖాందేవ్ మహాపూజకు సిద్ధం

నార్నూర్: ఈ నెల 6న మండల కేంద్రంలో నిర్వహించే ఖాందేవ్ మహాపూజకు ఆదివాసీ గిరిజనులైన తొడసం వంశస్తులు సిద్ధమయ్యారు. వారి ఆరాధ్యదైవమైన ఖాందేవుడికి ఏటా జనవరిలో వచ్చే పుష్యమాసంలో మహాపూజ నిర్వహిస్తారు. దీనికి దేశంలోని నలుమూలల నుంచి తొడసం వంశస్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. వారి సంస్కృతి, సంప్రదాయం ప్రకారం పూజలు చేస్తారు. అనంతరం ప్రతీ ఇంటి నుంచి సేకరించి తెచ్చిన నువ్వుల నూనెను నైవేద్యంగా సమర్పిస్తారు. వంశ ఆడబిడ్డ వంశస్తుల సమక్షంలో దాదాపు మూడు కిలల నువ్వుల నూనె తాగడం ఆనవాయితీ. మంగళవారం మాన్కాపూర్ గ్రామంలో నీ ఘానా (యంత్రం) ద్వారా నూనెను తయారు చేశారు. ఉదయం పవిత్ర స్నానం చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆలయ కమిటీ సభ్యుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు.

సావిత్రీబాయి పూలే జయంతి

బాసర(ముథోల్): బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతిని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి డైరెక్టర్ సతీశ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు.

గంజాయి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరికి జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవీకృష్ణ మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్‌కు చెందిన కరల సత్యపాల్, కొతులే సునీల్ ఇంద్రవెల్లి నుంచి గంజాయిని నార్నూర్‌కు తరలించగా పట్టుబడ్డారు. దీంతో అప్పటి ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. పీపీ రమణారెడ్డి ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా జడ్జి పైతీర్పు చెప్పారు.

యువకుడి అనుమానాస్పద మృతి


అర్బాజ్‌ఖాన్ (ఫైల్)

జైనథ్: మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్ వద్ద ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన ముజాయిద్‌ఖాన్ కుమారుడు అర్బాజ్‌ఖాన్ (19) ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ నెల ఒకటిన ఉదయం 6గంటలకు టిఫిన్ సెంటర్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. కాగా, సాత్నాల ప్రాజెక్ట్ వద్ద అర్బాజ్‌ఖాన్ చెప్పులు, బైక్ కనిపించగా సోమవారం సాయంత్రం జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు గజ ఈతగాళ్లతో సాత్నాలలో గాలించారు. మంగళవారం మధ్యాహ్నం అర్బాజ్ ఖాన్ మృతదేహం లభించగా పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఏఎస్సై రాథోడ్ ఆత్మారాం తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


శివలీల(ఫైల్)

ముధోల్: మండలంలోని విఠోలి గ్రామానికి చెందిన వివాహిత శివలీల(రాజశ్రీ) (19) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తానూర్ మండలం హిప్నెల్లి గ్రామానికి చెందిన శివలీలకు విఠోలి గ్రామానికి చెందిన సింగ్నేవార్ సాయినాథ్‌తో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. ఆమెకు పెళ్లి ఇ ష్టం లేకపోవడంతో గత డిసెంబర్ 31న పురుగుల మందు తాగింది. శివలీల నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి పరిస్థితి విషమించి చనిపోయింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జైపూర్ ఏసీపీ వాంగ్మూలం నమోదు

ఆదిలాబాద్‌టౌన్: జైపూర్, జన్నారంలో రెండు భూవివాదాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టులో జైపూర్ ఏసీపీ నరేందర్ వాంగ్మూలం నమోదు చేశారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక జడ్జి ఎం.సతీశ్‌కుమార్ ఆయన వాంగ్మూలం తీసుకున్నారు. 2020 సంవత్సరానికి సంబంధించి కోర్టు ఏసీపీ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఇందులో పీపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, లైసన్ అధికారి తాజొద్దీన్ తదితరులున్నారు.

'డాక్టర్‌పై దాడి సరికాదు'

నిర్మల్‌టౌన్: డాక్టర్‌పై దాడి సరికాదని డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని డాక్టర్స్ లైన్‌లో ఫిజియోథెరపీ డాక్టర్ నరేస్‌పై సోమవారం సాయంత్రం పలువురు దాడి చేశారు. నరేన్ క్లినిక్‌లో ఇంతకుముందు సోఫీనగర్‌కు చెందిన షాఫియా కాంపౌండర్‌గా పనిచేసేది. డాక్టర్ వద్ద రూ.10వేలు అడ్వాన్స్‌గా తీసుకుంది. తర్వాత ఆమె వేరే ఆసుపత్రిలోకి వెళ్లిపోయింది. సోమవారం సాయంత్రం సమయంలో క్లినిక్ ముందు షాఫియా కనబడగా డాక్టర్ నరేన్ ఆమె వద్దకు వెళ్లి డబ్బులు అడిగాడు. దీంతో షాఫియా తల్లి షబానా, ఆమె చిన్నమ్మ సుల్తానా డాక్టర్ కాలర్ పట్టుకుని దాడికి ప్రయత్నించారు. అంతటితో ఆగకుండా షాఫియా తన బంధువులను పిలిపించింది. అక్కడకు చేరుకున్న ఆమె బంధువులు జరిగిన విషయం తెలుసుకోకుండా క్లినిక్‌లోకి ప్రవేశించి డాక్టర్‌పై రాడుతో ఇష్టం వచ్చినట్టు కొట్టారు. దీంతో డాక్టర్ పక్క ఆసుపత్రికి వెళ్లాడు. అయినా ఆగకుండా డాక్టర్‌పై దాడి చేస్తూనే ఉన్నారు. వెంటనే డాక్టర్ నరేన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోగా వారిలో కొందరు పరారయ్యారు. ఈ ఘటనలో మొత్తం 11మంది నిందితులున్నారు. వీరిలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రాడు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించి మిగతావారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పక్కన పట్టణ సీఐ

నిజాయితీ చాటుకున్న పోలీస్

నిర్మల్ టౌన్: తనకు దొరికిన బంగారు గొలుసును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన హెడ్ కానిస్టేబుల్ నిజాయితీ చాటుకున్నాడు. పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన రాజమణి అనే మహిళ తన బంగారు గొలుసును జిల్లా కేంద్రంలోని గాయత్రీ బ్యాంక్‌లో కుదువపెట్టి రుణం తీసుకుంది. మంగళవారం బ్యాంక్‌లో అప్పు చెల్లించి బంగారు గొలుసు తీసుకొని బయటకు వచ్చే క్రమంలో జారిపడింది. పెంబి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ రఫీక్‌కు బంగారు గొలుసు దొరికింది. వెంటనే దాన్ని తీసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అప్పగించారు. అప్పటికే మహిళ బంగారు గొలుసు పోయిందని వెతుక్కుంటూ బ్యాంక్‌కు వెళ్లింది. ఫలితం లేకపోగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. దీంతో ఐడీ పార్టీ పోలీసులు కూన సందీప్, సురేశ్‌గౌడ్ బ్యాంకు వద్దకు చేరుకొని సీసీ కెమెరాలు పరిశీలించి బాధితురాలిని నిర్ధారించుకున్నారు. పట్టణ సీఐ శ్రీనివాస్ సిబ్బందిని అభినందించారు. బాధితురాలికి చైన్ అప్పగించారు. పోయిన గొలుసు దొరకగా బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.


బాధితురాలికి చైన్ అప్పగిస్తున్న పట్టణ సీఐ

దొరికిన పత్తి దొంగలు

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామశివారు ప్రాంతాల్లో ఇటీవల పత్తి దొంగతనం చేసిన నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసులు వివరాలు వెల్లడించారు. గత డిసెంబర్ 25న అందకూర్ గ్రామానికి చెందిన రవీందర్ రావు అనే రైతు పత్తి ఏరి చేన్లో నిల్వ ఉంచగా.. 3.35 క్వింటాళ్లు, గత డిసెంబర్ 29వ అందకూర్‌కు చెందిన కన్నం లక్ష్మణ్ పంట కల్లం వద్ద నిల్వ ఉంచిన నాలుగు క్వింటాళ్ల పత్తిని ఆటోల్లో ఎత్తుకెళ్లారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. మంగళవారం కల్లూర్-కుంటాల రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ఆటోల్లో పత్తిని తరలిస్తున్న మనీశ్, నారాయణ, సాయికృష్ణను పట్టుకుని విచారించారు. దీంతోవారు పత్తిని దొంగతనం చేసినట్లు అంగీకరించారు. రెండు ఆటోలతో పాటు రూ.35,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు రాందాస్, దేవరావు, సిబ్బంది గంగాధర్, జాదవ్ బాబు, శ్యాంనాయక్ తదితరులున్నారు.


పోలీసుల అదుపులో నిందితులు

10నుంచి కడెం ఆయకట్టుకు నీటి విడుదల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు ఈ నెల 10నుంచి యాసంగి పంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. పంటలకు నీటిని విడుదల చేయాలని రైతుల సమక్షంలో తీర్మానించారు. వారబందీ పద్ధతిన ఐదు తడులు సాగునీటిని విడుదల చేస్తామని, ఆరుతడి పంటలే వేయాలని సూచించారు. ఎంపీపీ కిషన్, జెడ్పీటీసీ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీక్ అహ్మద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, డీఈ భోజదాసు, నాయకుడు రమేశ్‌రావు పాల్గొన్నారు.

అడవిలో అరుదైన పక్షులు


ఇండియన్ డర్టర్ పక్షి


గే హీడెడ్ ఫిష్ ఈగల్

జన్నారం అటవీ డివిజన్ రకరకాల జంతువులకే కాకుండా అరుదైన పక్షులకు ఆవాసంగా మారింది. డివిజన్‌లోని మైసమ్మ కుంటలో పక్షుల కిలకిలలు నిత్యం వినిపిస్తుంటాయి. ఈ ప్రాంతంలో ఆసియా దేశాల్లో ఉండే అరుదైన ఇండియన్ డర్టర్ పక్షి, గ్రే హీడెడ్ ఈగల్ మంగళవారం కనిపించాయి. వీటిని డిప్యూటీ కన్జర్వేటర్, జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు తన కెమెరాలో బంధించారు. –జన్నారం